క్లుప్తంగా

పెంపుడు జంతువులకు టీకాలు

తెనాలి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం రోజైన శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని పశు వైద్యశాలలో పశువులు, పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పలువురు పెంపుడు కుక్కల యజమానులు, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. పశు వైద్యశాల డాక్టర్ బి.నాగిరెడ్డి, సిబ్బంది టీకాలను వేశారు. రేబీస్ వ్యాధికి చికిత్స లేదని, నివారణే మందని ఆయన చెప్పారు. పెంపుడు కుక్కలను పెంచుకునే ప్రతి ఒక్కరూ తమ కుక్కలకు ఏటా రేబీస్ టీకా వేయించాలని సూచించారు.

వైద్యానికి రూ.45వేలు ఆర్థిక సాయం



తెనాలిఅర్బన్: రెండు కిడ్నీలు పాడైపోయిన మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం అంగలకుదురు గణేష్ యూత్ సభ్యులు రూ.45వేలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. తెనాలి పట్టణం 7వ వార్డుకు చెందిన సంకా నాగసుకన్యకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. విషయం తెలుసుకున్న గణేష్ యూత్ సభ్యులు రూ. 45 వేలు ఆర్థిక సాయాన్ని ఆమె మామ సంకా రాధాకృష్ణకు అంగలకుదురులో అందజేశారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీ, ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గోళ్లపూడి సాయిగిరి, షేక్ సలాం, ముక్కమాల సుబ్బయ్య, దిలీప్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన శ్రీవారాహి నవరాత్రులు



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మ శాస్త అయ్యప్పస్వామి దేవస్థానంలో రాజశ్యామల పీఠం తరఫున శనివారం వారాహి నవరాత్రులు శనివారం వైభవంగా ప్రారంభించారు. నిర్వాహకులు నాగార్జునశర్మ వారాహి అమ్మవారి మూలమంత్రాలతో హోమం చేశారు. వేద మంత్రాలతో ప్రాంగణం మార్మోగింది. విశేష ద్రవ్యాలతో హోమం చేసి పూర్ణాహుతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. నాగార్జునశర్మ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీ నుంచి 15 వరకు వారాహి నవరాత్రులు నిర్వహిస్తామని అన్నారు. లోక కల్యాణర్థం ప్రతి రోజు హోమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో లీలాకృష్ణ, దాసరి రాము భక్తులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళాలయ మెలో డీస్ ఆధ్వర్యంలో 24వ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఏవీ రత్నాజీ అధ్యక్షత వహించారు. గాయకులు పి.మొగిలి, ఈ.భరత్‌రెడ్డి, ఏవీ.రత్నాజీ సినీ, భక్తి గీతాలు ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డ్‌పై కె.రవి, తబలాపై ఎస్.వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ చక్కటి వాయిద్యా సహకారాన్ని అందించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందగా మరొకరి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నుదురుపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎస్.హనుమంతురావు(38), టి.ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై పొలం వెళ్లి.. తిరిగి ఇంటికి వస్తున్నారు. గ్రామ శివారులోకి రాగానే రైల్వేస్టేషన్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న హనుమంతురావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులుకూ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతనిని వాహనంలో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సీఐ వీరబాబు ఆదేశాల మేరకు.. ఎస్ఐ వీరనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం శనివారం గుంటూరు తరలించారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పట్టణంలో పలు చోట్ల ఘన నివాళులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: భారతదేశ ఉప ప్రధానిగా పనిచేసిన సీనియర్ పార్లమెంటేరియన్ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తి దాయకమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. దేశ సమగ్రతకు, సమైకత్యకు ఆయన నిరుపమాన కృషి చేశారని చెప్పారు. నేటితరం అలాంటి నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని సూచించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. శివకుమార్ మాట్లాడుతూ దేశానికి స్వేచ్ఛావాయువులు ప్రసాదించేందుకు జరిగిన స్వాతంత్ర్య ఉద్యమంలో జగ్జీవన్‌రామ్ తన వంతు పాత్రను నిర్వహించారని సోదాహరణంగా వివరించారు. అణగారిన, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు చేసిన కృషి గొప్పదన్నారు. సీనియర్ పార్లమెంటేరియన్‌గా కేంద్రంలో ఎన్నో మంత్రి పదవులు నిర్వహించిన ఆయన దేశానికి ఎనలేని సేవలు చేశారని చెప్పారు. యువతరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పార్టీ నాయకులు సూచించారు. నివాళి అర్పించిన వారిలో పార్టీ నాయకులు మన్నవ ప్రభాకర్, అత్తోట చంటి, గుంటూరు కృష్ణ, అక్కిదాసు కిరణ్, యలవర్తి సాంబశివరావు, రావి శ్రీనివాసరావు, కఠారి హరీష్ , దుబాయ్‌బాబు, వేజండ్ల శ్రీకాంత్, కౌన్సిలర్ యాతాటి అనిల్, టెక్స్‌బాల, షరీఫ్, పినపాటి అనిల్ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ భారతదేశానికి అందించిన సేవలు మరువరానివని జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షులు కఠెవరపు దేవానంద్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత హక్కుల కోసం, అంటరాని ప్రజల శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కఠెవరపు కోటేశ్వరరావు మాదిగ, కిన్నెర నాగేశ్వరరావు మాదిగ, మానుకొండ రాంబాబు, కొత్తపల్లి రామారావు, యల్లమాటి నాని, తదితరులు పాల్గొన్నారు.

- రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, అక్కిదాసు కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా దేశంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో రఫీ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.
- రైల్వేస్టేషన్ రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాస్ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అస్పృస్యత, అంటరానితనం నిర్మూలనకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువరానిదన్నారు. దళితుడు అయిన జగ్జీవన్ రామ్‌ను ప్రధాని పదవి చేపట్టకుండా ఆనాటి కాంగ్రెస్ పాలకులు అడ్డుకున్నారని ఆరోపించారు. దళితుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. కార్యక్రమంలో కొమ్ము రాయల్, కఠెవరపు ప్రసాద్, కొండమూది బోసు, తదితరులు పాల్గొన్నారు.
- బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలని సినీ దర్శకుడు దిలీప్‌రాజా డిమాండ్ చేశారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి దిలీప్ రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో రెండు పర్యాయాలు చెరసాలలో ఉన్నారని గుర్తు చేశారు. ఆయన మరణించి ఏళ్లు గడుస్తున్నా నేటికి భారతరత్నను ప్రభుత్వం ప్రకటించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మిలటరీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్‌కు నివాళి

తెనాలిరూరల్: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని తెనాలికి చెందిన బాబు జగ్జీవన్‌రామ్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మారిస్‌పేట ఎరువుల కొట్ల బజారులోని బీజేఆర్ కమిటీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కార్మిక, వ్యవసాయ తదితర శాఖల కేంద్ర మంత్రిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం సందర్భంలో రక్షణ శాఖ మంత్రిగా ఆయన అవలంబించిన విధానాలు విజయానికి దోహదపడ్డాయని గుర్తు చేశారు. అనంతరం ఐతానగర్ లింగారావు సెంటరుకు వెళ్లి అక్కడి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యాక్రమాల్లో సిద్దెల కమలాకరరావు, ప్రొఫెసర్ కన్నెగంటి రత్నాకర్, న్యాయవాదులు ఇందుపల్లి రాజారామ్, సుద్దపల్లి మురళి, ఎ.జాస్మిన్, కొండముది బోసుబాబు, కొండముది రమేష్, పినపాటి రాజేష్, కఠవరపు వినోద్, పినపాటి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



ఐక్యవేదిక కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ దుబాయ్‌బాబు



జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేఆర్ కమిటీ సభ్యులు

రైల్వే గేట్లపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



తెనాలిరూరల్: తెనాలిలోని పినపాడు గేటు మీదుగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ది తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు కోరారు. స్థానిక మారిస్‌పేటలోని పినపాడు, రేపల్లె రైల్వే గేట్లను సంఘ సభ్యులు శనివారం పరిశీలించారు. విజయవాడ–చెన్నై రైలు మార్గంలోని పినపాడు గేటు వద్ద రైళ్ల రద్దీని పరిశీలించిన అనంతరం సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నాలుగు నిమిషాలకు రైలు వెళుతుండడంతో గేటు వేసి ఉంచాల్సిన పరిస్థితి ఉందని, దీని వల్ల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రెండు గేట్ల మీదుగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గతంలో ఎమెల్యేగా ఉన్న సమయంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారని, కొన్ని కారణాల చేత ఆగిపోయిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముందన్నారు. ఆయన వెంట రావూరి శివశంకరరావు, అబ్దుల్ ఆరీఫ్, వాకా పేరిరెడ్డి, అబ్రహాం లింకన్, రాజేష్, కె.బాబు ప్రసాద్, పూలా సతీష్, రమేష్ తదితర సభ్యులు ఉన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పోటీలు

ఏఎన్‌యూ: ఏబీవీపీ 75వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు పవన్ కుమార్ తెలిపారు. జూలై 9న వ్యవస్థాపక దినోత్సవాన్ని నేషనల్ స్టూడెంట్స్ డేగా జరుపుతున్నామని, ఈసందర్భంగా ముందస్తుగా విద్యార్థులకు రెండు కిలో మీటర్ల పరుగు, పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, కంటి వైద్య శిబిరం, తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వైద్యారోగ్య సిబ్బంది

తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. తెనాలి పుర పాలక సంఘం ఆధ్వర్యంలో ఐతానగర్‌లో శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం, నిల్వ ఉన్న, ఈగలు, క్రిమి కీటకాలు వాలిన ఆహారాన్ని భుజించడం వలన అతిసార వ్యాధి వస్తుందని తెలిపారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని తినడం వంటివి చేయాలన్నారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలు అవుతుంటే వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమారి మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఏడిస్ దోమకాటు వలన ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. నీటి నిల్వలో దోమలు గుడ్లు పెడతాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎం స్కూల్‌లోని విద్యార్థులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా సిబ్బంది జి.రవికుమార్, ప్రధానోపాధ్యాయులు పిల్లి రాజుకిషోర్, ఉపాధ్యాయులు బెల్లకొండ వెంకట్, శ్రీనివాసరావు, స్వప్న, హరినాథ్, హెచ్‌వి.విజయకుమారి, సచివాలయ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో జాప్యం వద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న అరుణాబాయ్

తూములూరు(కొల్లిపర): వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నందున వర్షపు నీరు నిల్వ ఉండే పల్లపు ప్రాంతాల్లో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్ అన్నారు. శనివారం మండలంలోని తూములూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. గ్రామసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని పంచాయతీ, ప్రభుత్వ పరమైన సమస్యలు ఉంటే ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తెలియజేస్తే వెంటనే అటువంటి సమస్యలు పరిష్కరించటానికి అవకాశాలు ఉంటాయిని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన కూడలిలో ఉన్న దుకాణాదారులు రోడ్డు వరకు స్థలాన్ని ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారన్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. సర్పంచ్ వివరణ ఇస్తూ అధికారుల సమక్షంలో పరిశీలించి ఆక్రమణకు గురైతే వెంటనే వాటిని తొలిగించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు, ప్రసాద్, వీఆర్‌వో రామారావు, మాజీ ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది అంబేడ్కర్, వార్డు మెంబర్లు ఆరుమళ్ల శివారెడ్డి, అవుతు సుధాకర్‌రెడ్డి, కొండా కిషోర్‌రెడ్డి, వింత వేణుగోపాలరెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తెనాలి,తెనాలి రూరల్ : జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ, తెనాలి శాఖ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు మాట్లాడుతూ 1901లో కోల్‌కతాలో జన్మించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశ శ్రేయస్సు, అభ్యున్నతి కోసం అద్భుతమైన విధానాన్ని చూపారని సోదాహరణంగా చెప్పారు.దేశంలో రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు, రెండు సుప్రీంకోర్టులు ఉండకూడదనేది ఆయన సిద్ధాంతంగా చెప్పారు. భారతదేశం ఎప్పటికైనా విశ్వానికి గురువు కావాలన్నది ఆయన లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ దిశగానే పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. 370 ఆర్టికల్ రద్దు చేయటం, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘనమైన నివాళి అర్పించడమేనని స్పష్టంచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాజుల వెంకయ్యనాయుడు, సీహెచ్ విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు అన్నవరపు వేణు, ధారా సాయిగుప్త, డి.జార్జ్, శిఖ రవీంద్ర, పి వెంకటేశ్వరరావు, కాటూరి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

గుంటూరు మెడికల్: అమ్మ కోసం చెట్టు కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని 4వ మండలం అరండల్ పేట వావిలాల సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత శ్యామప్రసాద్ ముఖర్జీ, వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటంకు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

సీపీఎం కార్యకర్తపై దాడి అమానుషం

జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచి కామినేని రామారావుపై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేయడాన్ని అమానుషం అని జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన గ్రామంలో పెన్షన్లు రానివారిని జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి అర్జీ అందించడం జరిగిందని చెప్పారు. టీడీపీ నాయకులు రామారావుపై దాడిచేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రస్తుతం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వారిపై దాడిచేయడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందుతులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జూలై 7,8న రాజకీయ శిక్షణ తరగతులు..

సీపీఎం గుంటూరు జిల్లా కార్యకర్తల జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 7,8 తేదీలలో 2/7 బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం తెలిపారు. శిక్షణ తరగతులకు శాఖ కార్యదర్శులు, మండల పట్టణ కమిటీ సభ్యులు, ఎంపికయిన కార్యకర్తలు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

సోషల్ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయాలి

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కనీసం జిల్లా కార్యాలయంలో వారంలో రెండు రోజులు కూడా ఉండరని అన్నారు. అదే విధంగా ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసే క్రమంలో అభ్యర్థుల వయోపరిమితి ప్రకారం భర్తీ చేయాల్సి ఉంటే కొంతమంది అభ్యర్థులు దగ్గర లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకొని అభ్యర్థుల మార్కులు ప్రకారం పోస్టులు భర్తీ చేశారని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, అజయ్, గణేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



ఆర్గానిక్ మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఆర్గానిక్ మొక్కల పెంపకంపై అందరికీ అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 31వ వార్డులో ఆర్గానిక్ ఫామింగ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కూరగాయల పంటలను కూడా ఎక్కువగా పండించాలని సూచించారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి శేషుబాబు ఉన్నారు.

మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చేపట్టాలి



ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ ఎస్తేరు సునీల



శ్రీపూజిత స్కూల్లో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి



గ్రీన్ ఇండియా కార్యక్రమ ర్యాలీలో ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల పేర్కొన్నారు. శనివారం వన మహోత్సవం సందర్భంగా లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎస్తేరు సునీల మాట్లాడుతూ మొక్కలు జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ ఆరోగ్య భద్రతకు పాటు పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగ అధికారి ఎం.వినయ్‌కుమార్, కళాశాల మేనేజర్ డాక్టర్ ఎస్ఏ వెస్లీ పాల్గొన్నారు.

వన సంరక్షణపై దృష్టి సారించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే వన సంరక్షణపై దృష్టి సారించాలని శ్రీపూజిత స్కూల్ ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శనివారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మానవ అవసరాలకు అడవులను నరికివేయడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటోందని అన్నారు. జూలై నెలలో వేసవిని తలపించే ఎండలకు చెట్ల నరికివేత కారణమన్నారు. మొక్కలకు ప్రాణం ఉంటుందని, మనుషుల వలే అవి కమ్యూనికేషన్ చేసుకుంటాయని పరిశోధనల్లో రుజువైందని వివరించారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: నెహ్రూనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ కింద గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డి.భారతి ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చాటుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. భారతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో డీఎస్ దుర్గారావు, పీఈటీ రవిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: బొంగరాలబీడులోని లూర్ధ్స ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం యువజన సర్వీసులశాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. బాలశౌరి అధ్యక్షతన జరిగిన సదస్సులో కెరీర్ కౌన్సెలింగ్ ట్రైనర్ డాక్టర్ వీర రాఘవరావు ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. సదస్సులో స్టెప్ మేనేజర్ బి. రాధిక, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షయ నివారణకు టీకా తప్పనిసరి

ఫిరంగిపురం: క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు బీసీజీ టీకా వేయించుకోవాలని వైద్యురాలు శ్వేత తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలో ఫ్యామిలీ పిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 187 మందికి డాక్టర్ శ్వేత వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించారు. షుగర్ బాధితులు, గతంలో క్షయ వ్యాధి వచ్చినవారు, వారికి సమీపంలో ఉన్నవారు, 18 ఏళ్లు నిండి బరువు తక్కువగా ఉన్నవారు బీసీజీ టీకా వేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం ఎస్కే మాబు, విజయ్‌కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుగా కనకదుర్గ బాధ్యతల స్వీకారం

వేమూరు: డిప్యూటీ తహసీల్దారుగా కనకదుర్గ శనివారం బాధ్యతలు చేపట్టారు. రేపల్లె మండలం కేంద్రంలో సార్వత్రిక ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుగా ఆమె పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు.